క్లుప్తంగా

రైతు భరోసాపై ప్రత్యేక మహాజన సభ



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం ఉదయం 9గంటలకు జిల్లా అధికారి ఆధ్వర్యంలో రైతుభరోసా పథకంపై ప్రత్యేక మహాజన సభ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ రంగారెడ్డి ఆదివారం ఒక ప్రనటనలో తెలిపారు. ఈ సమావేశంలో రైతుభరోసా పథకానికి సంబంధించిన విధి విదానాలు, సహకార సంఘాల సభ్యుల నుంచి పలు సలహాలు, సూచనలు తీసుకొనుటకు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రైతు సంఘం సభ్యులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై సలహాలు, సూచనలు ఇచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో రైతుభరోసాపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం రైతులతో సూచనలు, సలహాలు తీసుకోనేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆదివారం పీఏసీఎస్ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రత్యేక మహాజన సభకు చైర్మన్ గజేందర్‌రెడ్డి, పాలక సభ్యులు హాజరవుతారని, రైతులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: విద్యుత్ సరఫరాలో సోమవారం అంతరాయం ఉంటుందని అలంపూర్ చౌరస్తా సబ్ డివిజనల్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ సబ్ స్టేషన్ నుంచి 33కేవీ ఉండవెల్లి ఫీడర్‌లోని 33/11కేవీ సబ్ స్టేషన్‌కు వెళ్లే 33 కేవీ టాంపింగ్ లైన్లు ఏబీ స్విచ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో 33/11 కేవీ ఇటిక్యాల సబ్ స్టేషన్‌కు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఇటిక్యాల సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఇటిక్యాల సబ్‌స్టేషన్‌లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఇటిక్యాల సబ్‌స్టేషన్ పరిదిలోని పలు గ్రామాలకు సుమారు మూడు గంటలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు దీనిని గమనించి స్థానిక విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం

గట్టు: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సభ్యులతో పాటు జెడ్పీటీసీ, పీఏసీఎస్ చైర్మన్, మండల స్థాయి అధికారులు, అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని కోరారు.

టిప్పర్లకు నిబంధనలు వర్తించవా?



రాజోళి: తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్లకు నిబంధనలు వర్తించవా? అని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మండల కేంద్రం నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను నిలిపేసి ప్రశ్నించామని, వారు సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. స్థానిక ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకునే అధికారులు టిప్పర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. రూట్ మ్యాప్ లేకుండా వారి ప్రయోజనార్థం వాహనాలు తిరగడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ప్రైవేట్ బస్సు, కారును ఓవర్ టేక్ చేయబోయి కా రుకు తగలడంతో అద్దాలు దెబ్బతిన్నాన్నాయి. దీంతో కారు డ్రైవర్ నరేష్ ఫిర్యాదు చేయడంతో బస్సు డ్రైవర్ రాముడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వనపర్తి జిల్లా నుంచి కర్నూల్‌కు ప్రైవేట్ బస్సు ప్రయాణిస్తోంది. ముందు వెళ్తున్న కారును పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో బస్సు ఓవర్ టేక్ చేస్తూ కారు తగలడంతో అద్దాలు దెబ్బతిన్నాయి. దీంతో కారుడ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పుస్తకాల పేరిట దోపిడీ

- ఒక్కొక్క విద్యార్థి నుంచి పుస్తకాలు, యూనిఫాంలకు రూ.వేలల్లో వసూలు
- అధిక ధరలు భరించలేక తల్లిదండ్రుల ఆందోళన
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



జిల్లా కేంద్రంలో ప్రైవేట్ స్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు(ఫైల్)

గద్వాల అర్బన్: పిల్లలకు మంచి చదువును అందించాలనే కోరికతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల చేర్పిస్తే, అక్కడ వసూలు చేసే ఫీజులు పెనుభారంగా మారుతున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు ఏటేటకు పెరుగుతున్నాయి. దీనికి తోడు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు స్కూళ్లు నిబంధనలు తుంగలో తొక్కి యూనిఫాం, షూ, బెల్టులు, పుస్తకాలకు ఫీజుల పేరిట వసూలు చేస్తూ తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. అధిక ధరలకు విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నాయి. ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చేస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో బయటి పుస్తకాలకు అ నుమతి ఉండదు. తమ దగ్గరే కొనుగోలు చేయాలని చెబుతున్నారు. ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ పుస్తకాలు, యూనిఫాంల పేరిట దందా చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు పట్టించుకో వడం లేదని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలతో ముడుపులు తీసుకోని తనిఖీ చేయకుండా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొదటి తరగతికి రూ.4,230పైనే..

జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు ఓ వైపు ఫీజుల మోత మోగిస్తుండగా, మరోవైపు పుస్తకాల కొనుగోలుతో అధికభారం మోపుతున్నారు. జిల్లా కేంద్రంలో సుమారు 32 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వాటిలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు గంపగుత్తగా స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూళు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.500–1000ఉండే పుస్తకాలను ఏకంగా రూ.5వేలకు పైగా వసూలు చేస్తున్నారు. నర్సరీకి రూ.1,580నుంచి రూ.2000ల వరకు వసూళు చేస్తుండగా, ఫస్ట్ క్లాస్‌కు రూ.4,230పైనే వసూళ్లు చేస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పెద్ద ఎత్తునే వసూళ్లు చేస్తున్నారు. మరోవైపు యూనిఫాం, షూస్, టై, బెల్టు పేరుతో అదనంగా రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. ఐఐటీ బుక్స్ పేరుతో రూ.2000–3000వరకు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారు. ఎవరైనా తల్లిదండ్రులు ప్రశ్నిస్తే 'ఇష్టం ఉంటే తీసుకోండి, లేదంటే లేదు, మా స్కూళ్లో ధరలు ఇలాగే ఉంటాయి' అంటూ చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక విద్యార్థుల తల్లిదండ్రులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

బుక్ సెంటర్లు, ప్రత్యేక గదుల్లో..

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు పుస్తకాలు, నోట్ పుస్తకాలను స్కూళ్ల సమీపంలో ప్రత్యేక షట్టర్లను అద్దెకు తీసుకోని అందులో అమ్మకాలు చేపడుతున్నారు. మరికొందరు స్కూళ్ల యాజమాన్యాలు బుక్ సెంటర్ల నిర్వాహకులతో ఒప్పందం చేసుకోని వారికి సెట్‌కు కమీషన్ చెల్లిస్తూ బుక్స్‌ను విద్యార్థులకు అంటగడుతున్నారు. స్కూళ్లలో కట్టిన రిసిప్ట్ తీసుకోని వారు సూచించిన బుక్ సెంటర్‌లో చూ పిస్తే బుక్స్‌ను ఇస్తున్నారు. ఇంకొందరు ఏకంగా స్కూళ్లలోనే పెట్టి దర్జాగా అమ్ముతున్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఉండే జిల్లా కేంద్రంలోనే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఇలా దోపిడీ చేస్తున్నారంటే జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ ఏ విధంగా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

విద్యాశాఖ అధికారులు కనుసన్నల్లోనే..

విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ స్కూళ్లలో ఇప్పటి వరకు స్వయంగా తనిఖీ చేపట్టిన దాఖలు లేవు. ప్రైవేటు స్కూళ్లలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల పేరిట దందా చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇచ్చే ముడుపులతో విద్యాశాఖ అధికారులు స్కూళ్ల వైపు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నా రు. విద్యార్థి సంఘాలు ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాలను పట్టుకోని విద్యాశాఖ అధికారులకు సమాచా రం అందించినా అక్కడి చేసుకోని కేవలం సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్పా, సంబంధిత పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

చర్యలు తీసుకోవాలి



ప్రైవేటు స్కూళ్లలో అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారు. స్థానికంగా బుక్ సెంటర్ల నిర్వాహకులతో కలిసి ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విద్యా ర్థులకు అమ్ముతున్నారు. ఈ విషయం మండల విద్యాశాఖ అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి.

– హలీమ్ పాషా, పీడీఎస్‌యూ, జిల్లా అధ్యక్షుడు

నోటీసులు జారీ చేశాం..



ప్రైవేటు స్కూళ్లలో తనిఖీ చేపడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు స్కూళ్లలపై తప్పనిసరిగా చర్య లు తీసుకుంటాం. ఇటీవల జిల్లా కేంద్రంలోని పుస్తకాలను విక్రయిస్తున్న మూడు ప్రైవేటు స్కూళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. విద్యాశాఖ అధికారులు ముడుపులు తీసుకుంటున్నారనేది అవాస్తవం. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు తమ స్కూళ్లకు సంబంధించిన పుస్తకాలను బుక్ సెంటర్లలో, ఇతర చోట ఉంచి విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– సురేష్, ఎంఈఓ, గద్వాల

నాణ్యమైన భోజనం అందించాలి



బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న నాయకులు

మానవపాడు: విద్యార్థుల వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్లో భోజనంను పరిశీలించారు. వసతి గృహాల్లో వర్కర్లు చేయాల్సిన పనులను విద్యార్థినులతో చేయిస్తున్నారని విమర్శించారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తే రోజుకు ఇద్దరు చొప్పున డ్రమ్ములకు నీళ్లు మోపియడం, చీపురుతో తగరతి గదులను శుభ్రం చేయించడం చేస్తున్నారన్నారు. వర్షం కురిస్తే గోడలు తడిసి కరెంట్ షాక్ వస్తున్నాయన్నారు. కరెంట్ పోతే విద్యార్థులు చీకట్లో ఉంటున్నారని చార్జింగ్ లైట్లు లేవని విద్యార్థులకు తాగటానికి మంచినీళ్ల కోసం ఫిల్టర్ నీళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

అలంపూర్: నియోజవకర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. పట్టణంలోని టూరిజం హోటల్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. సుదీర్ఘకాలంగా నియోజకవర్గంలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. 2008, 2012లో ఇంటర్ బాలబాలికలకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారన్నారు. బాలుర వసతి గృహంలో 57 మంది, బాలికల వసతి గృహంలో 32 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. భవనాల వసతులు లేని చోట డిగ్రీ కళాశాలు ఏర్పాటు చేస్తున్నారు తప్పా సొంత భవనం ఉన్న చోట డిగ్రీ కళాశాల ప్రారంభించడం లేదన్నారు. అలంపూర్‌కు డిగ్రీ కళాశాల వస్తే వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. భారత మాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. 25 లక్షల పరిహారం అందించాలన్నారు. 2009 వరద బాదితులకు పట్టాలిచ్చి ప్లాట్లు చూపించాలన్నారు. అలంపూర్ చౌరస్తాలో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని తక్షణమే అందుబాటులోకి తేవాలన్నారు. మున్సిపాలిటీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు నరసింహ, నాగరాజు, ఆశన్న ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

అయిజ: మండల కేంద్రంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడారు. త్రీ మత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆప్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదువాలన్నారు. కార్యక్రమంలో, సభ్యులు ఈరన్న, వెంటేష్, రామచంద్ర, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డుగా విద్యుత్ స్తంభం



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక స హకార సంఘం ఎదుట రోడ్డుపై విద్యుత్ స్తంభం అ డ్డుగా ఉంది. సహకార సంఘంలోకి వాహనాలు వె ళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. విద్యుత్ అధికారులకు చాలా సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

శాంతినగర్: దేశంలోని ప్రతి ఒక్కరూ ఒక మొ క్క నాటాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని, ఆరోగ్య భారత్ కోసం మొ క్కలు నాటుదామని బీజేపీ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు నరసింహులు పిలుపునిచ్చారు. ప్ర ధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ ప్రోగ్రాంను బీజేపీ నాయకులు తిలకించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని ఎన్నో సూచనలు, సలహాలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరూరులో భారీ వర్షం



ధరూరు: మండలంలో ఆదివారం సాయంత్రం భా రీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గంట పాటు కుండపోత వాన కురిసింది. ముంగారు పంటల సాగు కు అనూకూలంగా ఉందని రైతులు సంతోషం వ్య క్తం చేస్తున్నారు. మెట్ట పంటల్లో విత్తుకున్న విత్తనా లు త్వరగా మొలకెత్తేందుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొన్నారు. నారు మడులు సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్లకు కరిగెట చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

మోస్తరు వర్షం.. రైతులు హర్షం

ఉండవెల్లి: మండల కేంద్రంలో మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం వర్షం కురవడంతో రైతులు పంటలకు ఉపశమనం కలిగిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టరా?



మల్దకల్: అయిజ–గద్వాల ప్రధాన రహదారిలోని పెద్దపల్లి గ్రామ సమీపంలో రైతులు పైపులైన్ కోసం రెండు చోట్ల రోడ్డును అడ్డంగా తవ్వడంతో ఏర్పడిన గుంతలు మృత్యుకుహరంగా మారాయి. తవ్విన గుంతలకు ఆర్అండ్‌బీ అధికారులు, రైతులు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ఎంతో మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులయ్యారు. ఇప్పటికై నా అధికారులు వాహనదారుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

ధరూరు: అకారణంగా వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటన మండలంలోని నెట్టెంపాడులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి నెట్టెంపాడుకు చెందిన వడ్ల బసన్న ఆచారిపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు తమ ఇంటి వైపు ఎందుకు వచ్చావంటూ దాడి చేశారు. ఈ దాడిలో వడ్ల బసన్నకు కాలు, చేయి విరిగాయి. బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాధాక్రిష్ణ, శ్రీకాంత్, మహేష్, మహదేవ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నిజమైన రైతులకు భరోసా అందించాలి



అలంపూర్‌లో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న



గట్టులో మాట్లాడుతున్న డీసీఓ ప్రసాద్‌రావు

అలంపూర్: పంట సాగు చేసే నిజమైన రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరారు. అలంపూర్ పట్టణంలోని పీఏసీఎస్‌లో అలంపూర్ సహకార సొసైటీ రైతులతో రైతు భరోసా అందించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక మహాజన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్, పీఏసీఎస్ చైర్మన్‌లు మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, కార్యదర్శులు హుస్సేన్ పీర, కేశవరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మట్టిని నమ్ముకున్న రైతును గుర్తించి రైతుభరోసా ఇవ్వాలని కోరారు. రైతు భరోసా అభిప్రాయాల సేకరణ పేరుతో జాప్యం చేయొద్దని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న అధికారులకు సూచించారు. ప్రభుత్వం అభిప్రాయాల సేకరణతో భారాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నం చేస్తే సకాలంలో భరోసా అందక రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోకుండా రైతులకు పంట బీమా పథకాన్ని వర్తించే విధంగా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కౌలు రైతులను గుర్తించి వారికి రైతు భరోసా పథకాన్ని వర్తించి ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందించాలని కోరారు.

పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి

గట్టు: ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా పథకాన్ని పది ఎకరాల వరకు అందించాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రైతు వేదికలో సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసాపై మహాజన సభను నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతు భరోసాపై రైతులు తమ అభిప్రాయాలను అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహకార సంఘం అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ అర్హులైన రైతులందరికి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా ద్వారా అందిస్తోందని, దీనిపై రైతులు ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని తెలిపారు. రైతుల అభిప్రాయాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు వెంకటేష్, అసిస్టెంట్ సబ్‌రిజిస్టార్ కో ఆపరేటివ్ మహేష్, ఏఈఓ తోహిద్, సహకార సిబ్బంది, సహకార సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. డ్రెయినేజీ మరిచారు!



ధరూరులో కుర్వ వీధిలో సీసీ రోడ్డుపై పారుతున్న మురుగు



సవారమ్మ ఆలయం సమీపంలో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు

ధరూరు: మండల కేంద్రంలోని కుర్వ వీధిలో ఇటీవల సీసీ రోడ్డు వేసిన అధికారులు ఇరు వైపులా డ్రెయినేజీ నిర్మించడం మరిచారు. దీంతో కాలనీలో ఇళ్లలోంచి వచ్చే మురుగు రోడ్లపై పారుతూ పాదచారులకు ఇబ్బంది కలిగిస్తోంది. ఉదయం వేళ వృథాగా పారే మిషన్ భగీరథ నీళ్లు రోడ్డుపై పారుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు మధ్యలో మురుగు పారడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలను నిర్మించాలని కుర్వ వీధివాసులు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపుల పచ్చదనం



రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లు

కేటీదొడ్డి: మండలంలోని పచ్చదనం రోడ్లకు ఇరువైపుల పరచుకుంది. వర్షాలకు రోడ్ల వెంబడి చెట్లు పచ్చదనాన్ని పంచుతూ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రకృతి రమణీయతను, ఆనందాన్ని అందిస్తూ ప్రయాణికులను ఉత్తేజ పరుస్తున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలు పెద్దవిగా పెరిగి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పచ్చని చెట్ల మధ్యలో ప్రయాణం చేస్తుంటే వీచే పిల్లగాలులకు తేలిపోతున్నట్లు ఉంటుంది. కేటీదొడ్డి మండలం మైలగడ్డ నుంచి పాతపాలెం రోడ్డుకు వెళ్లే రహదారుల్లో రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు ఎంతో పచ్చదనాన్ని పంచుతున్నాయి.

రహదారి మలుపుల్లో ప్రమాదం



ప్రమాదాలకు అడ్డాగా మారిన మైలగడ్డ స్టేజీ సమీపంలో మలుపులు

- గద్వాల–రాయచూర్ రహదారిలో పెరిగిన ప్రమాదాలు
- గ్రామాలకు వెళ్లే మలుపులు వద్ద సూచికలు కరువు

కేటీదొడ్డి: గద్వాల–రాయచూర్ ప్రధాన రహదారి వెంట ఉన్న ఆయా గ్రామాల స్టేజీల మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గద్వాల నుంచి మొదలుకోని కేటీదొడ్డి మండలం నందిన్నె వరకు దాదాపు ఏడు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటితో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే లింకు రోడ్ల వద్ద గ్రామాలను సూచించే బోర్డులు, మలుపుల సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ మాత్రం చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైంది.

మలుపులు..

గద్వాల నుంచి రాయచూర్ వైపుకు వెళ్లే మార్గంలో గద్వాల మండలం సంగాల స్టేజీ సమీపంలో మలుపు ప్రమాదకరంగా ఉంది. ధరూర్ మండలంలో పెట్రోల్‌బంకు, మూడు రోడ్ల కూడలి, బురెడిపల్లి, ర్యాలంపాడు, ప్రధాన కాల్వ వద్ద కేటీదొడ్డి మండలం మైలగడ్డ స్టేజీ వద్ద, ఉమిత్యాల స్టేజీ తదితర ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి.

సూచికలు కరువు..

రాయచూర్ రహదారి నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే ప్రాంతంలో ఊళ్ల పేర్ల బోర్డులు, ఎత్తు పల్లాలను సూచించే సూచికలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొత్తపాలెం స్టేజీ సమీపంలో నెల కిందట కోతులగిద్దె గ్రామానికి చెందిన రంగన్న పొలం నుంచి వస్తూ తాయమ్మ మిట్ట వద్ద నుంచి గ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. కేటీదొడ్డి గ్రామానికి చెందిన నర్సింహులు మైలగడ్డ స్టేజీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాయచూర్ జిల్లా వాసి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఇలా తరచూ గ్రామాలకు వెళ్లే మలుపులు వద్ద రోడ్డు ప్రమాదాలు సంభవిస్తునే ఉన్నాయి.

సూచికలు లేకనే ప్రమాదాలు



మా గ్రామానికి వెళ్లే మలుపు వద్ద సూచికలు లేవు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాయచూర్, గద్వా ల వైపు నుంచి వచ్చే వాహనాల వారు ఒకవైపు ఏటవాలు రోడ్డు కావడంతో స్పీడు ఎక్కువగా ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు మా గ్రామానికి తిరిగి వెళ్లే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– పొందు, పాతపాలెం

ప్రతిపాదనలు పంపించాం..

గద్వాల–రాయచూర్ మార్గంతో పాటు ఇతర మార్గాల్లోనూ కొంతమేరకు గ్రామాల పేర్ల బోర్డులు సూచికలు ఏర్పాటు చేశాం. అక్కడక్కడ గ్రామాల బోర్డులు లేని విషయం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. నిధులు రాగానే ప్రతి స్టేజీ వద్ద పేర్ల బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వరి, ఆర్అండ్‌బీ ఏఈ